క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మఠంపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో హిందీ (టీజీటీ), మ్యాథ్స్ (పీజీటీ), ఇంగ్లిష్ (పీజీటీ) సబ్జెక్టులు బోధించేందుకు కాంట్రాక్టు పద్ధతిన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రామ్‌నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ పోస్టులకు పీజీతో పాటు బీఈడీ, టీజీటీ పోస్టుకు డిగ్రీతో పాటు బీఈడీ అర్హత ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలని, ఈనెల 23న డెమో ప్రాతిపదికన ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ 94933 67012 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అభివృద్ధికి కీతవారిగూడెం గ్రామానికి చెందిన నామోజు నరేష్, హేమలత దంపతులు శుక్రవారం రూ.10 వేల విరాళాన్ని ఆలయ అధ్యక్షుడు తాళ్లూరి హనుమాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చేపూరి నరసింహచారి, కార్పెంటర్ సంఘం అధ్యక్షుడు గోధూరి బ్రహ్మచారిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారి నవీన్‌చారి, నాయకులు పెద్దోజు సూర్యనారాయణచారి, నామోజు నరేష్, బంగారు బ్రహ్మచారి, నెమ్మోజు నవీన్, శ్రీపాది రంగయ్యాచారి, వీరాచారి పాల్గొన్నారు.

డెక్కన్ సిమెంట్స్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు, పరిశ్రమ అధికారులు

పాలకవీడు : మండలంలోని డెక్కన్ సిమెంట్ పరిశ్రమలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ సీజీఎం నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ.. మిర్యాలగూడకు చెందిన మ్యాక్స్‌క్యూర్ హాస్పిటల్ వారిచే 300 మంది పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అవసరమున్న వారికి ఉచితంగా మందులు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరాజు, వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

బూరుగడ్డ ఆలయంలో సహస్రనామ కుంకుమార్చన



గోమాత పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో సహస్ర కుంకుమార్చనను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, సహస్రనామ కుంకుమార్చనలు, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, శ్రీగోదాదేవికి ప్రత్యేక పూజలు, అష్టోత్తర శతనామావళి, అలంకరణ, గోపూజ, అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, ఉపేందర్, భక్తులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాల స్ఫూర్తితో ఉద్యమించాలి



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

మునగాల : ఆనాటి నుంచి నేటివరకు ఎర్రజెండా పట్టుకొని ప్రజా సమస్యలపై పోరాడిన చరిత్ర సీపీఎంకే ఉందని, అమరుల త్యాగాల స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం మునగాల మండలంలోని కొక్కిరేణిలో సీపీఎం గ్రామశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శిగా రెండవ సారి నందిగామ సైదులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రావులపెంట వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి చందా చంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, వట్టెపు చినసైదులు, నిడిగొండ శంభయ్య, ముల్కలపల్లి సైదులు, హుస్సేన్, నాగరాజు, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు ఇరువైపులా ఆక్రమణ

- ఉలకవాగు ఆక్రమించి నిర్మాణాలు
- ఇటీవల వరదలొచ్చి కొట్టుకుపోయినా తిరిగి కట్టడాలు చేపడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



టీచర్స్ కాలనీలో ఉలకవాగును ఆక్రమించి వంతెనకు ఓ వైపు నిర్మించిన గోడ

కోదాడ : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదలకు కోదాడ పట్టణంలోని టీచర్స్ కాలనీ ముంపుకు గురైంది. టీచర్స్ కాలనీ, శ్రీమన్నారాయణ కాలనీల మధ్యలో ప్రవహించే ఉలకవాగు పూర్తిగా ఆక్రమణకు గురికావడంతో ఇళ్లల్లోకి నీరు చేరి భారీ నష్టం జరిగింది. ఉలక వాగుపై కోదాడ–హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న వంతెనకు ఇరువైపులా ఆక్రమణలు ముంపుకు ప్రధాన కారణమని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వంతెన పైవైపు పూర్తిగా వాగులోనే ఒకరు బహుళ అంతస్తుల భవనం నిర్మించారు. వాగుకు ఐదు ఖానాలు ఉంటే వాటిలో మూడింటిని మూసివేసి అడ్డంగా రోడ్డు వేశారు. దీనిపై ఎన్ని ఫిర్యాదులు చేసినా ఆర్‌అండ్‌బీ అధికారులు కాని మున్సిపాలిటీ అధికారులు కాని పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పది అడుగులే మిగిలిన వాగు..

టీచర్స్ కాలనీలో వంతెనకు కింది వైపు మరొకరు వాగును ఆక్రమించి గతంలో గోడ నిర్మాణం చేపట్టారు. దీంతో ముప్పై అడుగులు ఉండాల్సిన వాగు ప్రస్తుతం 10 అడుగులే మిగిలింది. ఇటీవల వచ్చిన వరదలకు అక్కడ నిర్మించిన షెడ్డు, గోడ కొట్టుకుపోయాయి. వరదలకు గోడ అడ్డంగా ఉండడంతో కాలనీలోని ఇళ్లల్లోకి నీరు వచ్చి చేరింది. ఇది జరిగి ఇరవై రోజులు కూడా కాకముందే అదే ప్రదేశంలో వాగు లోపల మరోసారి గోడ నిర్మించడం గమనించదగ్గ విషయం. ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏంటంటే నిర్మాణం కోసం పునాదులు తవ్వి ఆ వాగులోనే మట్టిని పోస్తున్నారు. ప్రధాన రహదారి వెంట జరుగుతున్న ఈ నిర్మాణ పనులను మున్సిపల్ అధికారులు కాని నీటి పారుదల శాఖ అధికారులు కాని పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా వాగు ఆక్రమణ విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని, మరోసారి కాలనీ ముంపుకు గురికాకుండా వంతెన వద్ద మూసివేసిన ఖానాలను తీయాలని వారు కోరుతున్నారు.

ఆలయ భూములను కాపాడాలని వినతి



దేవాదాయ శాఖ అదనపు కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణ

మునగాల : మండలంలోని పలు గ్రామాల్లో అన్యాక్రాంతమైన దేవాలయ భూములను పరిరక్షించాలని నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ కోరారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ ఎండీ.కృష్ణవేణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆక్రమణకు గురైన ఆలయ భూములను స్వాధీన పరచుకుని, బహిరంగ వేలం ద్వారా కౌలుకు ఇచ్చి ఆలయాల అభివృద్ధికి కృషిచేయాలని కోరినట్లు తెలిపారు. ఆక్రమణకు గురైన ఆలయ భూములపై త్వరలో సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ముత్యాలమ్మకు పూజలు



వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామంలో శుక్రవారం ముత్యాలమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ముత్యాలమ్మతల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పాడి పంటలు, ఆయురారోగ్యాలతో గ్రామస్తులు సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని ముత్యాలమ్మను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగరాజు, తక్కెళ్ల నాగార్జున, గ్రామస్తులు ఉన్నారు.

వరద బాధితులకు అండగా నిలిచిన విద్యార్థులు



వరద బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందిస్తున్న ఎంఈఓ, మున్సిపల్ చైర్‌పర్సన్

కోదాడ : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కోదాడలో నష్టపోయిన బాధితులకు కోదాడ బాలుర పాఠశాల విద్యార్థులు అండగా నిలిచారు. విరాళాల రూపంలో రూ. 20 వేలు సేకరించి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి శుక్రవారం పాఠశాలలో ఎంఈఓ సలీంషరీఫ్, మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. బాధితులకు మేము సైతం ఆదుకుంటామని విద్యార్థులు ఉడుత భక్తిగా చేయూతనివ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, లంకెల నిరంజన్ రెడ్డి, కమిషనర్ రమాదేవి, ఉపాధ్యాయులు మార్కండేయ, బడుగుల సైదులు, శ్రీనివాసరెడ్డి, ఖాజా, లింగయ్య, రామకృష్ణ, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ఆర్కిడ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

హుజూర్‌నగర్ : మండల స్థాయి క్రీడా పోటీల్లో పట్టణంలోని ఆర్కిడ్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ఇన్‌చార్జ్ ప్రసాద్, పీఈటీ నాగు శుక్రవారం తెలిపారు. అండర్ 14, 17 విభాగంలో కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానం, అండర్ 14 విభాగంలో వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు.

ప్రమాదకరంగా గుంత



గుంతపై చెట్ల కొమ్మలు వేసిన గ్రామస్తులు

చిలుకూరు : మండలంలోని సీతారాంపురం గ్రామంలో గుంత ప్రమాదకరంగా ఉంది. గ్రామానికి వెళ్లే మూలమలుపు వద్ద రోడ్డు పక్కన గుంత ఉంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతపై గ్రామస్తులు తాత్కాలికంగా చెట్ల కొమ్మలు వేశారు. కానీ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి గుంతను పూడ్చివేయాలని కోరుతున్నారు.

ఆర్‌కే కాలువ గండి మరమ్మతుల పరిశీలన



గండి మరమ్మతు పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ధృవకుమార్

చిలుకూరు : మండలంలోని ఆర్‌కే మేజర్ కాలువ గండికి మరమ్మతుల పనులను శుక్రవారం తహసీల్దార్ ధృవకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు త్వరితగతిన, నాణ్యవంతంగా పూర్తి చేయాలని సూచించారు. శనివారం సాయంత్రం వరకు పనులు పూర్తి కావచ్చని, పనులు పూర్తయిన వెంటనే ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేస్తారని తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ మంత్రిప్రగడ సీతయ్య, ఇరిగేషన్ డీఈ స్వప్న, ఏఈ మానస తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.2లక్షలు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడటౌన్ : పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన తేజావత్ భగావన్‌నాయక్ గత నెలలో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో మృతుని కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేసి చేయూతనిచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా నగదు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, రాష్ట్ర నాయకులు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

మిర్యాలగూడ : ప్రభుత్వ నిబంధనలకు మేరకు ఎరువులు, పురుగు మందులు అమ్మాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ ఏడీఏ దేవ్‌సింగ్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని రైతు వేదికలో నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డీలర్లు యూరియాను ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ అమ్మవద్దని అన్నారు. దుకాణాదారులు రికార్డులు పడక్బందీగా ఉండాలని, అదే విధంగా రికార్డుల రిపోర్టును తప్పని సరిగా వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందించాలన్నారు. యూరియా వాడకాన్ని కూడా తగ్గించాలన్నారు. అధికారులు, డీలర్లు తదితరులున్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ నారయణఅవిఎత్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. డివిజన్‌లోని వివిధ మారుమూల గ్రామాల్లోని ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లడం ఆర్థిక భారంతో పాటు సమయం కూడా వృథా అవుతుందని, ప్రజల సౌకర్యం కోసం డివిజన్ సమస్యలు సబ్ కలెక్టరేట్‌లో పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు ప్రజావాణిలో హాజరై చర్యలు తీసుకోవాలని కోరుతామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని ఆయన తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ ఎస్.హరిబాబు ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దూరం

మిర్యాలగూడ టౌన్ : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఎలాంటి వ్యాధులు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని బకల్‌వాడీ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వెంకన్న, మున్సిపల్ శానటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, పర్యావరణ ఇంజనీర్ శ్వేతారెడ్డి, పాఠశాల హెచ్ఎం కరుణాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గుర్వయ్య మృతి



గుర్వయ్య (ఫైల్)

నడిగూడెం : మండలంలోని శ్రీరంగాపురంనకు చెందిన బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండారు గుర్వయ్య (32) శుక్రవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా, ఆయన మృతదేహాన్ని పలువురు బీఆర్‌ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుర్వయ్య మృతి పార్టీకి తీరని లోటని నాయకులు అన్నారు.

కొనసాగుతున్న ‘ప్రజాపాలన’



మఠంపల్లిలో నిల్వ నీటిని తొలగింపజేస్తున్న వైద్యాధికారి సుధాకర్‌నాయక్

మఠంపల్లి : మండలంలో ప్రజాపాలన కార్యక్రమం శుక్రవారం నాలుగవ రోజు కొనసాగింది. మఠంపల్లి, రఘునాథపాలెం, చౌటపల్లి, మట్టపల్లి, కామంచికుంటతండా తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డ్రై డేలో భాగంగా దోమల నివారణకు నిల్వ నీటిని తొలగించారు. వీధుల్లోని మురికి నీటి గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేశారు. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో మండల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భూక్యా సుధాకర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శులు విజయ, లక్ష్మణ్‌నాయక్, ఎం.వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, సరిత, అంగన్‌వాడీ టీచర్లు గోవిందమ్మ, రాములమ్మ, వీరజానకి, రమణ, వైద్యసిబ్బంది, ఆశా వలంటీర్లు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలని ధర్నా



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

కోదాడరూరల్ : విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కోదాడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపుగా రూ.4500 కోట్ల ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్‌లు రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పైచదువులకు సర్టిఫికెట్ల కోసం వెళ్తే ఆయా విద్యాసంస్థలు ఫీజు రియింబర్స్ మెంటు రాలేదని, డబ్బులు చెల్లించాలని అడుగుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ కార్యాలయంలో అందజేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలంపల్లి సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సురగాని పరశురాం, రాజుల శివతేజ, అమరబోయిన ఉపేందర్, నరేష్, సురేష్, సతీష్, నవీన్‌నాయుడు, రాకేష్, గణేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

చిలుకూరు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా బాలురకు కబడ్డీ, ఖో- ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సలీమ్ షరీఫ్, కాంప్లెక్స్ హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి అజామ్‌బాబు, జీహెచ్ఎంలు గుజ్జుల నరసింహారెడ్డి, రామిరెడ్డి, గురవయ్య, జనపనేని రామారావు, సైదయ్య, మండల స్కూల్ గేమ్స్ ఇన్‌చార్జ్ సీతారాం రెడ్డి, పీఈటీలు బ్రహ్మారెడ్డి, రేణుక, ప్రకాశ్, శోభన్ బాబు, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి



సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ యాకుబ్ పాషా అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో లింగగిరి ప్రాథమిక వైద్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి రక్తపోటు, మధుమేహం, హిమోగ్లోబిన్, రక్తం తదితర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, మండల వైద్యాధికారి డాక్టర్ పుష్పలత, డాక్టర్లు కళ్యాణి, శ్రీప్రియ, అష్రఫ్, సీహెచ్ఓ పద్మ, శ్రీధర్‌రెడ్డి, గంగారావు, రాజశేఖర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ‘స్వచ్ఛతా హీ సేవ’ చేపట్టాలి



మోతె : బుర్కచర్లలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆంజనేయులు

మోతె : గ్రామగ్రామాన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం చేపట్టాలని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు బుర్కచర్ల, హుస్సేనబాద్ గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామాల్లో దోమల నివారణకు మురుగు నీటిలో బ్లీచింగ్ ఫౌడర్ చల్లాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకయ్య, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



నేరేడుచర్ల : ఫ్రీడం పార్క్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు

నేరేడుచర్ల : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని ఫ్రీడం పార్క్‌లో శుక్రవారం ఒక మొక్క - అమ్మ అనే నినాదంతో మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కను నాటే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఆర్‌పీలు, తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంకు సన్మానం



ప్రధానోపాధ్యాయుడు సురగాని లింగయ్య, అటెండర్ రాజ్యంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిలుకూరు : మండలంలోని ఆచార్యులగూడెంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి బదిలీపై వెళ్లిన సురగాని లింగయ్య, అటెండర్ రాజ్యంను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బజ్జూరి నరసింహారెడ్డి, ఉపాధ్యాయుడు దొంగిరి వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని కోరుతూ పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

నూతనకల్ : మండల కేంద్రం నుంచి చిల్పకుంట్ల, వెంకెపల్లి, తుంగతుర్తి మండల పరిధిలోని సంగెం వరకు రోడ్డును పునఃనిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పాదయాత్ర చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి ఈ పాదయాత్రను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండల కేంద్రంతోపాటు నియోజకవర్గ కేంద్రానికి ప్రధాన రహదారిని గత కొన్ని సంవత్సరాలుగా పునఃనిర్మించకపోవడంతో రోడ్డుపై అడుగుకో గుంత ఏర్పడిందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తున్నట్లు హడావుడి చేసి శిలాఫలకానికే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రోడ్డు నిర్మాణం కోసం ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యుడు మందుల సామేల్, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డిలు ప్రత్యేక చొరవ తీసుకొని రోడ్ల పునఃనిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. అనంతరం తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, కందాల శంకర్‌రెడ్డి, పులుసు సత్యం, దండా వెంకట్‌రెడ్డి, బత్తుల జనార్థన్, పల్లా సుదర్శన్, అలీపురం సంజీవరెడ్డి, చూడి మధుసూదన్‌రెడ్డి, అందెపల్లి లక్ష్మయ్య, తొట్ల లింగయ్య, తొనుకునూరి ఉప్పలయ్య, ఎల్లావుల నరేష్, పులసరి వెంకటముత్యం తదితరులు పాల్గొన్నారు.